సాక్షి
మహబూబాబాద్
మంగళవారం | 13 | ఫిబ్రవరి | 2024



మేడారానికి బస్సు చార్జీలు ఖరారు

ఆర్టీసీ యాజమాన్యం మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు నడిపే ప్రత్యేక బస్సులకు చార్జీలు ఖరారు చేసింది. - 8లో▸



మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి పోటెత్తింది. సోమవారం ఒక్కరోజే 8 వేల బస్తాలు అమ్మకానికి వచ్చాయి. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.4^0 / 18.0^0

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఉద్యోగ బాధ్యతలు



మహబూబాబాద్ రూరల్: ఏఆర్ అడిషనల్ ఎస్పీగా సీహెచ్.కుమారస్వామి జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. కుమారస్వామి కొత్తగూడెంలో ఏఆర్ డీఎస్పీగా, నారాయణపేట, ములుగు, ఖమ్మం జిల్లా పోలీస్ కార్యాలయాల్లో ఏఆర్ అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహించారు.

డీఆర్‌డీఓ ట్రాన్స్‌ఫర్

మహబూబాబాద్ అర్బన్: డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య బదిలీ అయ్యారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి డీఆర్‌డీఓ త్వరలో జిల్లా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. కాగా డీఆర్‌డీఓ సన్యాసయ్య ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు.

టెక్నికల్ కోర్సు సర్టిఫికెట్ల పరీక్షలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఈ నెల 24నుంచి 27వ తేదీ వరకు టెక్నికల్ కోర్సు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ రామారావు సోమవారం తెలిపారు. డ్రాయింగ్ లోయర్ పరీక్ష 24న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష ఉంటుందన్నారు. 25న పేపర్-3 పరీక్ష, 26న పేపర్-4 పరీక్ష ఉంటుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం పెయింటింగ్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. అలాగే ఈనెల 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు డ్రాఫ్టింగ్, గార్మెంట్ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు డార్క్ డ్రాఫ్టింగ్, గార్మెంట్ మేకింగ్, టైలరింగ్, హయ్యర్‌గ్రేడ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. టైలరింగ్ కోర్సుకు దరఖాస్తు చేసుకున్న వారు తమ సొంత కుట్టు మిషన్, మెటీరియల్ తెచ్చుకోవాలని, డ్రాయింగ్ వారు కూడా సంబంధిత మెటీరియల్‌తో పరీక్షకు హాజరుకావాలన్నారు.

నేడు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి రాక

హన్మకొండ: కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఈనెల 13న వరంగల్ పర్యటనకు వస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 1గంటకు హనుమకొండ విద్యుత్ నగర్‌లో బీజేపీ పార్లమెంట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వేయి స్తంభాల దేవాలయం కల్యాణ మండపం అభివృద్ధి పనులు పరిశీలిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఖిలా వరంగల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్ని పరిశీలిస్తారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను మంగళవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు పరిశీలిస్తామని డీఈఓ రామారావు సోమవారం తెలిపారు. ఇంటర్నల్ మార్కులు, సంబంధించిన రికార్డులను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వివరాలకు ఏసీజీఈ మందుల శ్రీరాములును సంప్రదించాలన్నారు.

ఎంపీపీగా భట్టు నాగరాజు ఎన్నిక



గార్ల: గార్ల నూతన ఎంపీపీగా భట్టు నాగరాజు ఎన్నికైనట్లు మహబూబాబాద్ ఆర్డీఓ, ఎన్నికల అధికారి అలివేలు వెల్లడించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీలు, అధికారుల సమక్షంలో ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు మండలంలోని 11మంది ఎంపీటీసీలకు గాను 9 మంది సభ్యులు హాజరై, ఇద్దరు గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. తొలుత ఎంపీపీగా సేరిపురం పంచాయతీ ఎంపీటీసీ భట్టు నాగరాజు పేరును వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాసరావు ప్రతిపాదించగా, ముల్కనూరు ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్ బలపర్చినట్లు పేర్కొన్నారు. నాగరాజును బలపరుస్తూ 8 మంది అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు చేతులెత్తారు. మెజార్టీ సభ్యుల ఆమోదంతో ఆయన ఎంపీపీగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈమేరకు ఎంపీపీ నాగరాజుకు నియామక పత్రం అందజేశారు. ఎంపీపీ ఎన్నిక సందర్భంగా ఎస్సై జీనత్‌కుమార్ ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో 144 సెక్షన్ విధించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ రజిని, డీటీ సుధాకర్ పాల్గొన్నారు.

కొత్త ముఖాలు



జిల్లాలో భారీగా అధికారుల బదిలీలు

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చర్యలు
- ఇప్పటికే తహసీల్దార్లు, ఎంపీడీఓలకు స్థానచలనం
- పోలీస్, ఎక్సైజ్‌శాఖల్లో ట్రాన్స్‌ఫర్స్

సాక్షి, మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో భారీగా ప్రభుత్వ అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. ముందుగా పోలీస్, తహసీల్దార్ల వరకే బదిలీలు ఉంటాయని భావించగా.. రోజుకోశాఖ చొప్పున ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వులు వస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ శాఖ అధికారులు బదిలీ అవుతారో.. ఎక్కడికి వెళ్లాల్సివస్తుందోననే ఉత్కంఠ మొదలైంది.

కొత్త పాలన..

నూతన ఏడాది మొదలుకాగానే జిల్లాలో కొత్త సంవత్సరం.. కొత్త పాలన అన్నట్లుగా మారింది. అసెంబ్లీ ఎన్నికల ముందు అనూహ్య పరిణామాల మధ్య ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్ బదిలీపై వచ్చారు. శాసనసభ ఎన్నికలు ముగియడం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఇక్కడ పనిచేసిన కలెక్టర్ శశాంక రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వచ్చిన అద్వైత్‌కుమార్ సింగ్ బాధ్యతలు తీసుకున్నారు. అదేవిధంగా జిల్లా అదనపు కలెక్టర్(స్థానికసంస్థలు)గా పనిచేసిన అభిలాష అభినవ్ స్థానంలో లెనిన్ వత్సవ్ టొప్పో వచ్చారు. అయితే వీరికి చేదోడువాదోడుగా ఉన్న కొందరు జిల్లా అధికారులను రోజుకోశాఖ చొప్పున బదిలీ చేయడంతో వారి స్థానంలో కొత్తవారు వస్తున్నారు.

పరంపర..

జిల్లాలో ఇటీవల వివిధ శాఖల్లో బదిలీల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లో పనిచేస్తున్న ఏడుగురు తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. అదేవిధంగా మరుసటి రోజు ఏకంగా 16 మంది ఎంపీడీఓలను బదిలీ చేస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ శాఖలో ఇప్పటికే డీఎస్పీ, తొమ్మిది మంది సీఐలు, 12 మంది ఎస్సైలు బదిలీ అయ్యారు. ఎక్సైజ్‌శాఖలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న సీఐ, ఎస్సై స్థాయి అధికారులను కూడా బదిలీ చేస్తూ ఆశాఖ ఉన్నతాధికారులు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎక్సైజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు బదిలీపై వెళ్తున్నారు. కానీ పోలీస్‌శాఖలో మాత్రం రోజుకో తీరుగా బదిలీ ఉత్తర్వులు రావడం.. ఒక రోజు బదిలీ అయిన అధికారి పేరు మరుసటి రోజు జాబితాలో లేకపోవడం.. వారి స్థానంలో కొత్త అధికారులు రావడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆశాఖలో చర్చగా మారింది.

వారి పరిస్థితి ఏమిటి..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ శాఖల ఉన్నతాధికారుల బదిలీలు జరుగుతుండగా.. జిల్లా ఏర్పడినాటి నుంచి ఇక్కడే తిష్టవేసిన వారు కదలడం లేదనే చర్చ జరుగుతోంది. అయితే కొందరు అధికారులు పదవీ విరమణకు దగ్గరగా ఉండడంతో నిబంధనల ప్రకారం వారిని బదిలీ చేయడం లేదని తెలిసింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనాటికి మరికొందరు అధికారులకు బదిలీ తప్పదని, అందులో సుదీర్ఘకాలం పాటు జిల్లాను అంటిపెట్టుకొని ఉన్నవారి పేర్లు కూడా ఉండే అవకాశం ఉందని అధికార వర్గాల్లో చర్చగా మారింది.

పోలీస్ శాఖలో..

మహబూబాబాద్ రూరల్: జిల్లా పరిధిలో పనిచేస్తున్న సీఐలను బదిలీ చేస్తూ పోలీస్‌శాఖ తెలంగాణ మల్టీజోన్ ఐజీ తరుణ్‌జోషి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం ఉమెన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న బానోతు రాజును గూడూరు సీఐగా బదిలీ చేశారు. గూడూరు సీఐ కె.ఫణిదర్‌ను మల్టీజోన్ వన్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా డీసీఆర్బీలో పనిచేస్తున్న టి.సంజీవ్‌ను తొర్రూరు సీఐగా బదిలీ చేశారు. తొర్రూరు సీఐ వై.సత్యనారాయణను మహబూబాబాద్ డీసీఆర్బీకి బదిలీ చేశారు. మహబూబాబాద్ డీసీఆర్బీలో పనిచేస్తున్న సీహెచ్.శ్రీనివాసులు మల్టీజోన్ వన్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఖమ్మం సీపీటీసీలో పనిచేస్తున్న పి.సర్వయ్యను మహబూబాబాద్ రూరల్ సీఐగా బదిలీ చేశారు. వరంగల్ కమిషనరేట్‌లో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న పెండ్యాల దేవేందర్‌ను మహబూబాబాద్ టౌన్ సీఐగా బదిలీ చేశారు. వరంగల్ కమిషనరేట్‌లో వెయిటింగ్‌లో ఉన్న బి. హథీరాంను మరిపెడ సీఐగా బదిలీ చేశారు. మరిపెడ సీఐ ఎల్.రాజును మల్టీజోన్ వన్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీఎస్పీ బదిలీ

మానుకోట డీఎస్పీ టి.సత్యనారాయణ బదిలీ అయ్యారు. హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. సైబరాబాద్ డీఎస్పీ ఎన్.తిరుపతిరావును మానుకోటకు బదిలీ చేశారు.

పెండింగ్ వినతులు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో
- 114 వినతుల స్వీకరణ

మహబూబాబాద్: ప్రజావాణిలో అందిన పెండింగ్ వినతులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా అదనపు కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,, సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం అనే విషయాన్ని గుర్తు పెట్టుకుని వినతులను పరిష్కరించాలన్నారు. కొన్ని వినతులను పరిష్కరించకపోతే కారణాలతో కూడిన నివేదికలు అందజేయాలన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో

ప్రజావాణిలో 114వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమాదేవి, సీపీఓ సుబ్బారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 12 డిమాండ్లతో కూడిన అంశాలు ఆ వినతిలో పేర్కొన్నారు.
- డీపీఆర్వో శ్రీనివాస్‌రావు మద్యం తాగి కార్యాలయానికి వచ్చి జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అతడిపై చర్య తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు వినతిపత్రం అందజేశారు. పలువురు జర్నలిస్టుల వద్ద డబ్బులు తీసుకుని ఇంటి స్థలాల జాబితా తయారు చేశారని ఆ డబ్బులతో కారు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు.
- మానుకోట మండలం జంగిలిగొండ క్రాస్‌రోడ్డు వద్ద 30 పడకల ఆస్పత్రి నిర్మాణం చేయాలని పలువురు నాయకులు వినతి పత్రం అందజేశారు.
- మానుకోట మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లి గ్రామానికి చెందిన ఆంగోత్ లింగమ్మ తన తండ్రి మరణించి 15 సంవత్సరాలు అయిందని, మరణ ధ్రువీకరణ పత్రం విషయంలో అధికారులు పట్టించుకోవడంలేదని వినతి పత్రం ఇచ్చారు.
- మానుకోట మండలం మల్యాల గ్రామానికి చెందిన గణేష్ ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నానని, అర్హతను బట్టి ఉద్యోగం ఇప్పించాలని వినతిలో పేర్కొన్నాడు.
- బయ్యారం మండలం కోటగడ్డ గ్రామానికి చెందిన శ్రీనివాస్ తన గేదె మూడు సంవత్సరాల క్రితం మృతి చెందితే నేటికి ఇన్సూరెన్స్ డబ్బులు రాలేదని, త్వరగా ఇప్పించాలని వినతిలో కోరాడు.

కల్వర్టుల పనులు పూర్తి చేయాలి

ములుగు రూరల్: మేడారం జాతర సందర్భంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా కల్వర్టుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ శబరీశ్ అన్నారు. సోమవారం గట్టమ్మ ఆలయ సమీపంలో నిర్మాణంలో ఉన్న కల్వర్టులను ఆయన పరిశీలించారు. జాతీయ రహదారి, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో పనుల పురోగతిపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. మహాజాతరకు భారీ సంఖ్యలో వాహనాలు వస్తాయని, రోడ్డు పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు.



కల్వర్టును పరిశీలిస్తున్న ఎస్పీ

వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి సై..



కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం కౌన్సిలర్లు

- కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన పత్రం అందజేత
- మానుకోట మున్సిపాలిటీలో రసవత్తరంగా రాజకీయాలు
- బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం కౌన్సిలర్ల సంతకాలు
- సీపీఐ ప్రజాప్రతినిధులు దూరం

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ మహ్మద్‌ఫరీద్‌పై అవిశ్వాస తీర్మానానికి కౌన్సిలర్లు సిద్ధమయ్యారు. సోమవారం బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం కౌన్సిలర్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు అవిశ్వాస తీర్మాన పత్రం అందజేశారు. కాగా 2023లో కూడా వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడానికి పలువురు కౌన్సిలర్లు ప్రయత్నం చేయగా.. నాయకులు నచ్చజెప్పడంతో వెనక్కి తగ్గారు. కాగా ఈ నెల 7వ తేదీన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆపార్టీ కౌన్సిలర్లు సమావేశమై అభిప్రాయ సేకరణ చేపట్టగా.. మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి మొగ్గుచూపారు. ఈమేరకు కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మాన పత్రం అందజేశారు.

బలబలాలు పరిశీలిస్తే..

మున్సిపాలిటీలో 36 వార్డులకు గాను ఒక వార్డు కౌన్సిలర్లు మృతి చెందగా 35 మంది కౌన్సిలర్లు ఉన్నారు. దీనిలో 22 మంది బీఆర్ఎస్, 9 మంది కాంగ్రెస్, ఇద్దరు సీపీఎం, ఇద్దరు సీపీఐ కౌన్సిలర్లు ఉన్నారు. కాగా వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లే తిరుగుబాటు చేశారు. ఈమేరకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన 19మంది కౌన్సిలర్లు, కాంగ్రెస్ నుంచి 8మంది, సీపీఎం లోని ఇద్దరు కౌన్సిలర్లు సిద్ధమయ్యారు. చైర్మన్ కూడా అనుకూలంగా సంతకం చేశారు. కాగా చిట్యాల జనార్దన్, బండి ఇందిర, పోతురాజు రాజు, సీపీఐ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు అవిశ్వాసానికి దూరంగా ఉంటున్నారు.

పార్టీలకతీతంగా నిర్ణయం..

కౌన్సిలర్లు మార్నేని వెంకన్న, సూర్నపు సోమయ్య, బుజ్జి వెంకన్న, ఎడ్ల వేణు, సలీం, భూక్య శ్రీను, హరిసింగ్, పద్మ, విజయమ్మ, శ్రీదేవి, ఫరీదా, స్వాతి, జ్యోత్స్న, సుజాత, జగన్, హర్షిక, సునీత, పద్మ కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన పత్రం అందజేశారు. ఈమేరకు కౌన్సిలర్లు మార్నేని వెంకన్న, సూర్నపు సోమయ్య, బుజ్జి వెంకన్న, ఎడ్ల వేణు మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉందన్నారు. పాలకవర్గం ఏర్పాటై నాలుగు సంవత్సరాలు పూర్తయిందని, వైస్ చైర్మన్ పాలన సరిగా లేదన్నారు. కౌన్సిలర్లను సమన్వయం చేసుకోవడంలో విఫలమయ్యారన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలపైనే దృష్టి పెట్టారని, అతడి విధానం బాగాలేక అవిశ్వాసానికి సిద్ధమైనట్లు పేర్కొన్నారు.

నాలుగేళ్లు పూర్తి..

పాలకవర్గం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయింది. కాగా అవిశ్వాసంలో నెగ్గాలంటే టు థర్డ్ మెజార్టీ ఉండాలి. ఈమేరకు 24మంది కౌన్సిలర్లు బలపరిస్తే అవిశ్వాసం నెగ్గుతుంది. కాగా 29మంది కౌన్సిలర్లు సంతకాలు చేయడంతో అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉంది. కాగా మార్నేని వెంకన్న వైస్ చైర్మన్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ముందుగానే ఆపేరును నిర్ణయించుకున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మెజార్టీ కౌన్సిలర్లు వైస్ చైర్మన్‌ను వ్యతిరేకించడంతో మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కూడా ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది.

సీఎం పర్యటనకు 'మేడిగడ్డ' సిద్ధం



మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, పోలీసు అధికారులు

- రేవంత్‌రెడ్డితోపాటు రానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- బ్యారేజీ పరిశీలన, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- కలెక్టర్, ఐజీ, ఎస్పీల ఆధ్వర్యంలో ఏర్పాట్ల పరిశీలన
- 'ముఖ్యుల' పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు

కాళేశ్వరం: గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, లోపాలు బయటికి తీసేందుకు ప్రాజెక్టును సందర్శిస్తామని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఈ మేరకు మంగళవారం మేడిగడ్డలో పర్యటించనున్నారు. ప్రాజెక్టు లోపాలను ప్రజలకు పూర్తిగా వివరించనున్నారనే నేపథ్యంలో సీఎం పర్యటన ఖరారైంది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం మేడిగడ్డ వద్ద అన్ని ఏర్పాట్లు చేసింది. సీఎంతోపాటు ముఖ్యులు అంతా వస్తుండడంతో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. నేడు (మంగళవారం) ఉదయం 10.15గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏసీ బస్సుల్లో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతరశాఖల ఉన్నతాధికారులు రోడ్డు మార్గంలో మేడిగడ్డకు బయలుదేరుతారు. సాయంత్రం 3.30గంటలకు బ్యారేజీకి చేరుకుంటారు. 7వ బ్లాక్‌లో ఏర్పడ్డ పగుళ్ల (గత అక్టోబర్ 21న కుంగినప్పుడు), 19, 20, 21, 22 పియర్‌లను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. గంటపాటు ఈ పరిశీలన ఉంటుంది. ఆ తర్వాత బ్యారేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభాస్థలి వద్ద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ప్రాజెక్టుపై ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్‌అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదికల ఆధారంగా ప్రజలకు వివరించనున్నారు. రాత్రి 7గంటలకు హైదరాబాద్‌కు తిరుగుప్రయాణమవుతారు. కాగా, సీఎం, కొంత మంది మంత్రులు తిరుగు ప్రయాణంలో హెలికాప్టర్‌లో వెళ్లనున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఇరిగేషన్ అధికారులు హెలిపాడ్‌లు కూడా సిద్ధం చేస్తున్నారు.



వేదిక వద్దకు రోడ్డు

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఐజీ, ఎస్పీ..

మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఏర్పాట్లను సోమవారం భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఐజీ శ్రీనివాస్, ఎస్పీ కిరణ్‌ఖరే, ఇరిగేషన్ ఎస్‌ఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ తిరుపతిరావు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు పరిశీలించారు. సభాస్థలి వద్ద రోడ్డు ఏర్పాటు చేశారు. అక్కడే సుమారు 2,500మంది వీవీఐపీలు కూర్చునేందుకు వేదిక ముందు టెంట్లు వేశారు. వీవీఐపీలు బస్సుల్లో వచ్చేందుకు మహదేవపూర్-కాళేశ్వరం జాతీయ రహదారి గుండా కుదురుపల్లి మీదుగా రోడ్డు మార్గాన వెళ్లేందుకు సిద్ధం చేశారు. వెళ్లడం, తిరిగి వచ్చే మార్గాలు ఒకే రోడ్డు గుండా కావడంతో అధికారులు పూర్తిస్థాయిలో భద్రతాచర్యలు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లపొదలు తొలగించారు. రోడ్డు డ్యామేజీ ఉన్న చోట మరమ్మతులు చేపట్టారు. ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. వీవీఐపీలకు, జర్నలిస్టులకు వేర్వేరుగా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచనున్నారు. ఎమర్జెన్సీ కోసం వైద్యాధికారులను అందుబాటులో ఉంచుతున్నారు. సీఎం వ్యక్తిగత భద్రతా అధికారి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బృందం, అధికారులు సుమారు 40 ప్రత్యేక వాహనాల్లో వస్తున్న క్రమంలో బందోబస్తు మరింత పటిష్టంగా ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని ఇక్కడి అధికారులకు సూచించారు. బ్యారేజీ దిగువ కాఫర్ డ్యాం వద్దకు మీడియాను ముందుగానే అనుమతించాలని అధికారులు తెలిపారు.

భారీ బందోబస్తు..

తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ బ్యారేజీ వద్దకు సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతరశాఖల ఉన్నతాధికారులు రానుండడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నలుగురు ఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 45 మంది ఎస్సైలు, 800 వరకు కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధుల్లో ఉంటారని తెలిసింది. ఇప్పటికే గ్రేహౌండ్స్ బృందాలు అడవులు, సరిహద్దుల్లోని తీర ప్రాంతాలను జల్లెడ పడుతున్నాయి.

సీఎం హోదాలో..



సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి మొదటిసారి మేడిగడ్డ పర్యటనకు రానున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. గతేడాది నవంబర్ 2న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ మేడిగడ్డకు వచ్చారు. సీఎం అయిన తర్వాత మేడిగడ్డ బ్యారేజీని సీరియస్‌గా తీసుకొని గత ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తిచూపించడానికి రానున్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మెరుగైన ఫలితాలు సాధించాలి

నర్సింహులపేట: విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా బోధన చేయాలని జీసీడీఓ విజయకుమారి ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆమె సందర్శించి పరిసరాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం 10వ తరగతి పరీక్షలపై విద్యార్థులతో మాట్లాడారు. బోధన, భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. మెనూ పాటిస్తున్నారా.. వసతులు ఎలా ఉన్నాయని తెలుసుకున్నారు. సక్రమంగా పని చేయని టీచర్లపై చర్యలు తప్పవన్నారు. అనంతరం ఎమ్మార్సీని సందర్శించి ఆన్‌లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలోని శ్రీ సాయికృష్ణ ప్రైవేట్ పాఠశాలను జిల్లా విద్యాశాఖ జిల్లా సెక్టోరియల్ అధికారులు సంతోష్, చంద్రశేఖర్ ఆజాద్ తనిఖీ చేశారు. పాఠశాల గుర్తింపు పత్రాలు, రిజిస్టర్లు, హాజరు పట్టికలు, ఆన్‌లైన్‌లో నమోదైన విద్యార్థుల వివరాలు, వసతులు, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వప్న, సీఆర్‌పీలు శేషుకుమార్, మహంకాళి వీరన్న , నాగేశ్వర్‌రావు, నరహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేజీబీవీలో మాట్లాడుతున్న జీసీడీఓ విజయకుమారి

గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతులు, మహిళలకు ఉపాధి కల్పించేందుకే కుట్టుమిషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని చింతలపల్లి గ్రామంలో నాబార్డు సహకారంతో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రతి మహిళ ఇలాంటి ఉచిత సేవ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోని, తమ కుటుంబాలకు బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రమేష్, రాష్ట్ర డైరెక్టర్ శ్రీదేవి, కోఆర్డినేటర్ భాస్కరాచారి, ప్రతినిధులు రాజేష్, సురేష్, మహేష్, నాగరాజు, సందీప్, మురళి, రాజేందర్, స్వాతి, హరిప్ర, మమత, మౌనిక పాల్గొన్నారు.

మిల్లెట్స్ ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రం ప్రారంభం

పెద్దవంగర: మండల కేంద్రంలో లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈఓ లతతో కలిసి నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్ ఫుడ్ ప్రాసెసింగ్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ముందుగా సైంటిస్టు స్వరూప జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ హైమావతి, కవిత, కేవీకే మల్యాల కోఆర్డినేటర్ మాలతి, చైర్మన్ శంకర్, స్వరూప, పద్మ, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్

క్లుప్తంగా

ఐటీడీఏ పీఓ అంకిత్ బదిలీ



చిత్రమిశ్రా, పీఓ, ఐటీడీఏ

ఏటూరునాగారం : సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) పీఓ అంకిత్ బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎం శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు)గా విధులు నిర్వర్తిస్తున్న చిత్ర మిశ్రాను ఏటూరునాగారం ఐటీడీఏ పీఓగా, అంకిత్‌ను నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. కాగా, మేడారం జాతర సమయంలో పీఓ బదిలీ చర్చగా మారింది. అంకిత్ 2022 జూన్ 13న ఏటూరునాగారం ఐటీడీఏ పీఓగా బాధ్యతలు చేపట్టారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

తొర్రూరు : లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ కథనం ప్రకారం.. దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్లకు చెందిన షేక్ యాకూబ్ అలీ(57) స్క్రాప్ బిజినెస్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన ద్విచక్రవాహనం మరమ్మతు నిమిత్తం తొర్రూరుకు చేరుకున్నాడు. వాహన మరమ్మతు అనంతరం ఇంటికి వెళ్లేందుకు రోడ్డు పైకి వచ్చాడు. ఈ క్రమంలో వరంగల్ నుంచి ఖమ్మం వైపునకు అతివేగంతో వెళ్తున్న లారీ.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో షేక్ యాకూబ్ అలీకి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు షేక్ యాసిన్ పాషా ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు.

నిచ్చెన పైనుంచి పడి విద్యార్థి..



తేజ (ఫైల్)

వాజేడు: నిచ్చెనపైనుంచి పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం ములుగు జిల్లా వాజేడు మండలం కడేకల్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఎర్మ హరినాథ్, కృష్ణవేణి దంపతుల పెద్ద కుమారుడు తేజ(9) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి నిచ్చెన ద్వారా పొరిగింటి వారి డాబా(ఇల్లు)పైకి ఎక్కి ఆడుకున్నాడు. అనంతరం దిగుతున్న క్రమంలో నిచ్చెన విరగడంతో కింద పడ్డాడు. ఆ సమయంలో నిచ్చెనకు సంబంధించిన కర్రలు తేజ మర్మాంగాలకు బలంగా తగిలాయి. దీంతో కుటుంబీకులు 108లో ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తల్లిదండ్రులు, బంధువులు.. తేజ మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించారు. తేజకు తమ్ముడు, చెల్లి ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య



భార్గవి (ఫైల్)

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని ఎల్బాకలో సోమవారం ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన నువ్వుల భార్గవి (40) ఇంట్లో ఎవరూ లేని సమయంలో శరీరంపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భార్గవి ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. ఈ ఘటనపై కుటుంబీలకు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిలలు ఉన్నారు.

మేడారానికి బస్సు చార్జీలు ఖరారు

18 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక సర్వీస్‌లు
- 53 ప్రత్యేక పాయింట్ల నుంచి జాతరకు భక్తుల చేరవేత
- దూరాన్ని బట్టి పెరిగిన చార్జీలు

హన్మకొండ : ఆర్టీసీ యాజమాన్యం.. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు నడిపే ప్రత్యేక బస్సులకు చార్జీలు ఖరారు చేసింది. జాతరకు 6 వేల బస్సులు నడుపనుంది. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక బస్ పాయింట్ల నుంచి మేడారానికి బస్సులు ప్రారంభం కానున్నాయి. 2022 జాతరలో 2800 బస్సులు నడపగా, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన క్రమంలో ఈసారి 6 వేల బస్సులు నడిపేలా ప్రణాళిక ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో పెద్దలు, పిల్లలకు వేర్వేరు చార్జీలు రూపొందించింది. గత జాతరతో పోలిస్తే బస్సు చార్జీలు పెరిగాయి. ఎక్స్‌ప్రెస్ బస్సులకు దూరాన్ని బట్టి పెద్దలకు రూ.20 నుంచి రూ.130 వరకు చార్జీలు పెరిగాయి. పిల్లలకు రూ.10 నుంచి రూ.80 వరకు పెరిగాయి. డీలక్స్ బస్సులకు పెద్దలకు రూ.80 నుంచి రూ.140 వరకు, పిల్లలకు రూ.30 నుంచి రూ.80 వరకు పెరిగాయి. సూపర్ లగ్జరీకి పెద్దలకు రూ.100 నుంచి రూ.200 వరకు, పిల్లలకు రూ.70 నుంచి రూ.120 వరకు, రాజధాని ఏసీ బస్సులకు పెద్దలకు రూ.130 నుంచి రూ.220 వరకు పిల్లలకు రూ.110 నుంచి రూ.180 వరకు పెరిగాయి. కాగా, భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర వ్యాప్తంగా 53 ప్రత్యేక పాయింట్ల (ప్రదేశాలు) నుంచి ప్రత్యేక బస్సులు నడుపనుంది.



బస్సు చార్జీల వివరాలు

ఎక్స్‌ప్రెస్ బస్సులు..

పాయింట్‌లు	జాతర-2024 పెద్దలు	జాతర-2024 పిల్లలు	జాతర-2022 పెద్దలు	జాతర-2022 పిల్లలు
హనుమకొండ	రూ.250	రూ.140	రూ.200	రూ.110
కాజీపేట	250	140	200	110
వరంగల్	250	140	200	110
జనగామ	370	210	290	160
హైదరాబాద్	550	310	450	240
హైదరాబాద్ (ఫెరీపెరల్స్)	600	330	470	250
స్టేషన్ ఘన్‌పూర్	310	180	250	140
నర్సంపేట	250	150	200	110
కొత్తగూడ	300	170	240	130
పరకాల	250	140	190	110
చిట్యాల	250	140	200	110
మహబూబాబాద్	350	200	270	140
గూడూరు	280	160	230	130
తొర్రూరు	350	190	280	150
వర్ధన్నపేట	300	170	230	130
ఆత్మకూరు	210	120	160	90
మల్లంపల్లి	180	110	140	80
ములుగు	150	90	120	70
భూపాలపల్లి	220	130	180	100
గణపురం(ములుగు)	200	120	150	80
జంగాలపల్లి	150	90	110	60
పస్రా	80	50	60	40
గోవిందరావుపేట	100	60	70	40
తాడ్వాయి	60	40	40	30
గోదావరిఖని	370	200	300	160
హుస్నాబాద్	350	190	280	150
హుజూరాబాద్	310	170	250	140
కరీంనగర్	380	210	320	170
పెద్దపల్లి	380	210	320	170
మంథని	320	180	260	140
8.ఇన్‌క్లైన్	370	200	300	160
ఇల్లందు	400	210	---	---
కొత్తగూడెం	350	190	280	150
భద్రాచలం	300	160	250	130
మణుగూరు	210	120	180	100
ఏటూరునాగారం	80	50	60	40
మంగపేట	110	70	90	50
పాల్వంచ	310	170	260	140
ఖమ్మం	480	250	410	210
కాళేశ్వరం	350	190	270	140
సిరొంచ(మహారాష్ట్ర)	370	200	300	160
కాటారం	260	150	210	120
ఆసిఫాబాద్	550	290	450	230
బెల్లంపల్లి	460	250	380	200
చెన్నూరు	420	230	340	180
మందమర్రి	450	240	370	190
మంచిర్యాల	410	220	---	---
శ్రీరాంపూర్	400	220	320	170
నార్లాపూర్ / చింతల్	40	30	30	30
చర్ల, వయా: ఏటూరునాగారం	250	140	190	100
వెంకటాపూర్	150	90	110	60
వాజేడు	120	70	100	60
పేరూరు	160	90	130	70

డీలక్స్ బస్సులు..

పాయింట్‌లు	జాతర-2024 పెద్దలు	జాతర-2024 పిల్లలు	జాతర-2022 పెద్దలు	జాతర-2022 పిల్లలు
హనుమకొండ	రూ.300	రూ.170	రూ.220	రూ.120
కాజీపేట	300	170	220	120
వరంగల్	300	170	220	120
జనగామ	420	240	320	180
హైదరాబాద్	650	360	500	270
హైదరాబాద్ (పెరీపెరల్స్)	670	370	530	290

సూపర్ లగ్జరీ..

పాయింట్‌లు	జాతర-2024 పెద్దలు	జాతర-2024 పిల్లలు	జాతర-2022 పెద్దలు	జాతర-2022 పిల్లలు
హనుమకొండ	రూ.350	రూ.200	రూ.250	రూ.130
కాజీపేట	350	200	250	130
వరంగల్	350	200	250	130
జనగామ	500	290	370	200
హైదరాబాద్	750	420	570	310
హైదరాబాద్ (పెరీపెరల్స్)	800	440	600	320

రాజధాని ఏసీ బస్సులు..

పాయింట్‌లు	జాతర-2024 పెద్దలు	జాతర-2024 పిల్లలు	జాతర-2022 పెద్దలు	జాతర-2022 పిల్లలు
హనుమకొండ	రూ.450	రూ.360	రూ.320	రూ.250
కాజీపేట	450	360	320	250
వరంగల్	450	360	320	250
జనగామ	650	520	480	370
హైదరాబాద్	950	750	740	570
హైదరాబాద్ (పెరీపెరల్స్)	1000	780	780	600

గరుడ ప్లస్ ఏసీ బస్సులు..

పాయింట్‌లు	జాతర-2024 పెద్దలు	జాతర-2024 పిల్లలు	జాతర-2022 పెద్దలు	జాతర-2022 పిల్లలు
హనుమకొండ	రూ.500	రూ.400	రూ.390	రూ.300
కాజీపేట	500	400	390	300
వరంగల్	500	400	390	300
జనగామ	750	590	570	440
హైదరాబాద్	1100	860	890	680
హైదరాబాద్ (పెరీపెరల్స్)	1150	900	930	720

జాతరకు 6వేల బస్సులు



మేడారం తాత్కాలిక బస్ స్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు



కుడా మైదానంలో భూమి పూజ చేస్తున్న వరంగల్-1 డీఎం మోహన్‌రావు

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీధర్

వరంగల్ చౌరస్తా: మేడారం సామక్క-సారలమ్మ జాతరకు భక్తులను తీసుకెళ్లడం, తిరిగి గమ్యస్థానాలకు చేర్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 53 ప్రాంతాల నుంచి 6వేల బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. సోమవారం వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో మేడారం జాతర బస్సుల ఏర్పాట్లకు పార్కింగ్, రాకపోకలు తదితర అంశాలంపై సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ, కాజీపేటలో బుధవారం నుంచి మేడారానికి బస్సులను నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఆదివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు సర్వీస్‌లు కొనసాగుతాయన్నారు. వరంగల్ బస్‌స్టేషన్ నుంచి 450 బస్సులు రోజూ 900 ట్రిప్పులు నడుస్తాయని పేర్కొన్నారు. మహిళలకు ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు.

ప్రత్యేకంగా ఏర్పాట్లు

వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్‌కు సమీపంలోని పాత పార్కు స్థలంలో బస్సుల పార్కింగ్ ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు. పార్కింగ్, బస్సుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా స్టేషన్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలను మళ్లిస్తున్నారు. బస్సుల రాకపోకలు సవ్యంగా సాగేందుకు ప్రత్యేకంగా సీసీ రోడ్డు నిర్మించారు. ఆర్ఎం వెంట ఈడీ రాఘునాథ రావు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు

హన్మకొండ: భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని కుడా (హయగ్రీవచారి) మైదానంలో మేడారం జాతర ప్రత్యేక బస్ పాయింట్ ఏర్పాటు పనులను ఆయన భూమి పూజచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుడా మైదానం నుంచి మేడారానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. ఇక్కడ బస్‌ల పార్కింగ్‌తో పాటు భక్తులు బస్సులోకి చేరేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇక్కడ నాలుగు క్యూలైన్లు, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలీస్ క్యాంపు, మెడికల్ క్యాంపు, అల్పాహారం కోసం క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 18 నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఈ భాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

- 8వేల బస్తాల పంట రాక
- ఆలస్యంగా టెండర్లు
- రైతుల పడిగాపులు
- మిర్చి యార్డుకు రెండు రోజుల సెలవు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం మిర్చి పోటెత్తింది. ఈ సీజన్‌లో 8వేల బస్తాలు అమ్మకానికి రావడం ఇదే మొదటిసారి. పంట అత్యధికంగా రావడంతో వ్యాపారులు టెండర్ వేయడం ఆలస్యమైంది. దీంతో విన్నర్ లిస్టు సాయంత్రం విడుదల కాగా, అప్పటి వరకు రైతులు యార్డులో పడిగాపులు కాశారు. అనంతరం కాంటాలు ప్రారంభించగా రాత్రి వరకు కొనసాగాయి. అయినా యార్డులో సగం మేర మిర్చి నిల్వలు ఉన్నాయి. దీంతో వ్యాపారుల కోరిక మేరకు ఈనెల 13, 14వ తేదీల్లో మిర్చి యార్డుకు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు తెలిపారు. కాగా, తేజమిర్చికి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.21,809, కనిష్ట ధర రూ.10,000 పలుకగా, తాలురకం మిర్చి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.14,256, కనిష్ట ధర రూ.8,000 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి

తగ్గిన మిర్చి ధర

కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర ఒక్కసారిగా తగ్గింది. ఈనెల 7న తేజ మిర్చి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.23,059, కనిష్ట ధర రూ.11,329 పలికింది. ఈనెల 8న గరిష్ట ధర రూ.23వేలు, కనిష్ట ధర రూ.10,001 పలికింది. కాగా, సోమవారం క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.21,809, కనిష్ట ధర రూ.10వేలు పలికింది. మిర్చి ధర ఒక్కసారిగా రూ.వెయ్యి పైగా తగ్గించారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని కూట్లకే అధిక ధర పెడుతూ, మిగతా కూట్లకు తక్కువ ధర వేసి, తమను వ్యాపారులు మోసగిస్తున్నారంటూ పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

మహిళపై ఎస్సై దురుసు ప్రవర్తన?

ఖిలా వరంగల్ : తనపై మిల్స్‌కాలనీ ఎస్సై దురుసుగా ప్రవర్తించారని వరంగల్ శివనగర్‌కు చెందిన ఓ మహిళ ఆరోపించింది. కుటుంబ కలహాల నేపథ్యంలో తాను ఫిర్యాదు చేస్తే పట్టించుకోని పోలీసులు.. తన భర్త ఫిర్యాదుపై మాత్రం స్పందించి తనను స్టేషన్‌కు పిలిచారన్నారు. మహిళ అని కూడా చూడకుండా తన పట్ల ఎస్సై దురుసుగా ప్రవర్తించి బైక్ తాళం లాక్కొని కించపరిచారని సోషల్‌మీడియాలో పోస్టు చేసింది. ఈ ఘటనపై ఎస్సై రాజును వివరణ కోరగా భార్య తరుపు బంధువులు కొట్టారని భర్త రఫీ ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో సదరు మహిళ, ఆమె సోదరులు పిలిపించి మర్యాదపూర్వకంగా మాట్లాడి పంపామని స్పష్టం చేశారు.

మానుకోటలో కిడ్నాప్ కలకలం

- వ్యక్తిని చితకబాదిన స్థానికులు
- పోలీసులకు అప్పగింత

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కిడ్నాప్ కలకలం సృష్టించింది. ఈ ఘటనలో స్థానికులు ఓ వ్యక్తిని చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాల నుంచి తల్లి తన ఇద్దరు పిల్లల (బాబు, పాప)ను తీసుకువచ్చి భద్రాచలం వెళ్లేందుకు వైఎస్సార్ సెంటర్‌లో బస్సు కోసం వేచి చూస్తోంది. పిల్లలు స్కూల్ డ్రెస్సులలో ఉండడంతో పక్కనే ఉన్న టిఫిన్ సెంటర్ వద్ద తల్లి ఆ పిల్లలకు దుస్తులు మారుస్తోంది. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి.. తన చిన్నారిని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని భావించిన తల్లి.. అప్రమత్తంగా వ్యవహరించి కేకలు వేసింది. గమనించిన స్థానికులు ఘటనా స్థలికి చేరుకుని ఆ వ్యక్తిని పట్టుకుని చితకబాదారు. వెంటనే టౌన్ ఎస్సై రామారావుకు సమాచారం అందించడంతో బ్లూకోల్ట్స్ పీసీలు సక్రాం, వీరన్న అక్కడికి చేరుకుని సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని సోదా చేయగా కత్తి (సీలింగ్ పనులకు వినియోగించే ఇనుప వస్తువు) లభించింది. అతడిని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ జరిపారు. సదరు వ్యక్తి కిడ్నాపర్ కాదని, బిహార్‌కు చెందిన చందన్ శర్మ అని, ఆర్తి గార్డెన్స్ ఆవరణలో సీలింగ్ పనులు చేయడానికి వచ్చాడని టౌన్ ఎస్సై రామారావు తెలిపారు. మద్యం మత్తులో ఆ బాలిక తన కుమార్తెలా ఉందని భావించి పట్టుకోగానే చిన్నారిని తల్లి భయపడిందని ఎస్సై పేర్కొన్నారు.



మద్యం మత్తులో ఉన్న వ్యక్తిని తీసుకెళ్తున్న పీసీలు

ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు

- ఎట్టకేలకు సీఐలకు స్థానచలనం

కాజీపేట అర్బన్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సూచనల మేరకు రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఈ.శ్రీధర్ సోమవారం మల్టీజోన్-1లో భారీగా సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 11 మంది సీఐలకు ట్రాన్స్‌ఫర్స్ అండ్ పోస్టింగ్ ఉత్తర్వులు అందాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆరున్నర సంవత్సరాలుగా ఒకే ఎక్సైజ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐలకు ఎట్టకేలకు స్థాన చలనం కలిగింది. సీహెచ్.నీరజ- డీటీఎఫ్ వరంగల్ నుంచి డీటీఎఫ్ మహబూబాబాద్‌కు, బి.కృష్ణ డీటీఎఫ్ మహబూబాబాద్ నుంచి ఖమ్మం-1 టౌన్‌కు, బి.చంద్రమోహన్ ఖిలా వరంగల్ నుంచి ఖమ్మం-2 టౌన్‌కు, కె.జగన్నాథరావు పరకాల నుంచి నేలకొండపల్లికి, సీ.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి భూపాలపల్లి నుంచి సత్తుపల్లికి, ఎం.ప్రశాంతి కాటారం నుంచి సింగరేణికి, బి.కరుణశ్రీ ఐఎంఎల్ డిపో-1 హనుమకొండ నుంచి డీటీఎఫ్ ఖమ్మానికి, టి.శ్రీనివాసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్ నుంచి హుజూరాబాద్‌కు, ఎం.మాధవీలత ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్ నుంచి జమ్మికుంటకు, ఎల్.రామకృష్ణ హనుమకొండ నుంచి చెక్‌పోస్ట్ యాంచా, ఫకీరా ఏటూరునాగారం నుంచి మంబోజీపల్లి, మెదక్‌కు బదిలీ అయ్యారు.

ఉమ్మడి జిల్లాకు వచ్చిన వారు..

జి.దుర్గా భవాని హుజూరాబాద్ నుంచి హనుమకొండకు, కె.రాజు ఖమ్మం-1 టౌన్ నుంచి ఖిలా వరంగల్‌కు, ఎస్.ప్రభాకర్‌రెడ్డి జగిత్యాల నుంచి వరంగల్ అర్బన్‌కు, సీహెచ్.సామ్యూల్ ఆనంద్‌రావు సుల్తానాబాద్ నుంచి డీటీఎఫ్ వరంగల్ అర్బన్‌కు, ఎం.తిరుమలత కరీంనగర్ నుంచి ఐఎంఎల్ డిపో-1 హనుమకొండకు చెన్న నాగేశ్వర్‌రావు డీటీఎఫ్ కొత్తగూడెం నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్‌కు, కె.నాగయ్య అశ్వరావుపేటనుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్‌కు, పి.రజనీ బొల్లారం సంగారెడ్డి నుంచి ఏటూరునాగారం, ఎం.రమ్య వైరా నుంచి భూపాలపల్లికి, టి.నరేందర్ మంచిర్యాల నుంచి కాటారానికి బదిలీపై వచ్చారు.

నేటి నుంచి ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణ

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని కాజీపేట, వరంగల్, డోర్నకల్, భద్రాచలం మార్గాల్లో మంగళవారం నుంచి పలు ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం రాత్రి తెలిపారు. ఇటీవల పలు సెక్షన్‌లో ఇంజనీరింగ్ బ్లాక్‌లలో ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

నేటి నుంచి నడిచే రైళ్లు..

కాజీపేట-డోర్నకల్ (07753) పుష్‌పుల్, డోర్నకల్-కాజీపేట (07754) పుష్‌పుల్, డోర్నకల్-విజయవాడ (07755) పుష్‌పుల్, విజయవాడ-డోర్నకల్ (07756) పుష్‌పుల్, భద్రాచలం రోడ్-విజయవాడ (07278) ప్యాసింజర్, విజయవాడ-భద్రాచలంరోడ్ (07979) ప్యాసింజర్‌లు మంగళవారం నుంచి యాథావిధిగా నడుస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రైలు నుంచి ప్రయాణికురాలిని నెట్టివేసిన టీసీ



గాయపడిన రజని

మహబూబాబాద్ రూరల్ : రైలు నుంచి ఓ ప్రయాణికురాలిని టీసీ నెట్టివేయగా, ఆమెకు స్వల్ప గాయమైంది. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏక రజని సికింద్రాబాద్ వెళ్లేందుకు మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. మధ్యాహ్నం సమయంలో కాకినాడ- షిర్డీ రైలు రాగానే జనరల్ అనుకుని రిజర్వేషన్ బోగీలో ఎక్కింది. ఆ కొద్ది సేపటికే రైలు కదిలింది. అంతలోనే ఆ బోగీలో ఉన్న టీసీ వచ్చి ఆమెను అందులోనుంచి కిందకు దిగమన్నాడు. రైలు కదిలి వెళ్తున్న సమయంలోనే ఆమెను నెట్టివేయగా ప్లాట్‌ఫారంపై పడింది. ఈ ప్రమాదంలో రజని తలకు స్వల్ప గాయమైంది. ఆర్పీఎఫ్ సిబ్బంది ఆమెకు ప్రథమ చికిత్స చేసి పంపించారు.

క్షేత్ర స్థాయిలో పట్టు సాగుపై అధ్యయనం

- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: పట్టు రైతులకు జిల్లా అధికార యంత్రాంగం సహకారం అందిస్తుందని, క్షేత్రస్థాయిలో పట్టుసాగుపై అధ్యయనం చేస్తానని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో సెంట్రల్ సిల్క్ బోర్డు, ప్రాంతీయ పట్టు పరిశోధ కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పట్టు కృషి మేళా, పట్టు రైతులు, డీలర్లు, వీవర్ల సమ్మేళనం నిర్వహించగా.. కలెక్టర్ సిక్తా పట్నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ మేళాలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పట్టు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టు సాగుకు రాష్ట్రంలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ లత మాట్లాడుతూ పట్టు రైతులు, డీలర్లు, వీవర్స్‌కు అవగాహన కలిగించేందుకు ప్రతి సంవత్సరం మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో పట్టు సాగు అభివృద్ధి సాధించిందన్నారు. ఒకసారి మల్బరీ నాటితే 15 సంవత్సరాల వరకు పట్టు పురుగులు పెంచొచ్చని రైతులకు సూచించారు. మొదటి సంవత్సరం మాత్రమే పెట్టుబడి అవసరమన్నారు. నెలకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందొచ్చని తెలిపారు. అనంతరం సీఎస్ఆర్‌టీ సైంటిస్టులు గాంధీదాస్, భాగ్య, రిటైర్డ్ డైరెక్టర్ ఖాద్రీ, సిద్దిపేట జిల్లా ములుగులోని ప్రాంతీయ పట్టు పరిశోధన స్థానం సైంటిస్టు వినోద్‌కుమార్ యాదవ్.. రైతులకు పట్టు సాగులో మెళకువలు వివరించారు. ఈ సందర్భంగా పట్టు కరదీపికను కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు, శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి శ్రీనివాస్ రావు, ప్రాంతీయ పట్టు పరిశోధ కేంద్రం టెక్నికల్ ఆఫీసర్ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



పట్టు సాగు కరదీపికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు, శాస్త్రవేత్తలు